ప్రజాశక్తి
శనివారం 21 జనవరి 2023
5



తపాలా శాఖ ఆధ్వర్యాన బీమా మేళా

ప్రజాశక్తి-పాడేరు: తపాలా శాఖ అందిస్తున్న బీమాపై పాడేరులో శుక్రవారం పోస్టల్ శాఖ అధికారులు ప్రమాద బీమా మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూపరింటెండెంట్ (అనకాపల్లి) జననాల ప్రసాద్ బాబు ప్రమాద బీమా పాలసీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకవేళ రోడ్డు ప్రమాదం బారిన కుటుంబ పెద్ద పడితే ఒక్కోసారి ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోతుందన్నారు. టాటా ఏఐజీతో కలిసి తమ కస్టమర్ల కోసం గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పేరిట ప్రమాద బీమా పాలసీని తీసుకొచ్చామన్నారు. ఏడాదికి రూ.399తో రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. 18 నుంచి 65 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ బీమా పాలసీ తీసుకోవచ్చని తెలిపారు. ప్రమాదంలో పాలసీదారుడు మరణించినా, శాశ్వత వైకల్యం ఏర్పడినా, అవయవం కోల్పోయినా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్పెక్టర్ మురళి ఇమండీ, పోస్ట్ మాస్టర్లు ఆరుమూరు గిరీష్ కుమార్, ఈశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుల

ప్రతిపాదనలు నిలిపి వేయాలి

గిరిజన సంఘం సదస్సులో పలువురు వక్తల డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజనుల మనుగడను దెబ్బతీసే అల్లూరి జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన భవన్‌లో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామాల గిరిజనులతో శుక్రవారం గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్కు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ, ఎర్రవరం, పెదకోట, చిట్టంపాడు, గుజ్జెలి ప్రాంతాల్లో సుమారు 5100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్లో నిర్ణయించారని, ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్)ను నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసి కార్పొరేట్ కంపెనీలకు అటవీ సంపదను దోచి పెట్టడానికి ఆయా ప్రాంతాల్లో 8 డ్యాముల నిర్మాణానికి సన్నద్ధం అవుతున్నారన్నారు. ఎర్రవరం, పెదకోట, గుజ్జెలీ, చిట్టంపాడు హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణంలో సుమారు 100 గ్రామాలలో 15వేలమంది ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టపోతారన్నారు. సాగులో వున్న వ్యవసాయ భూమి సుమారు 5000 ఎకరాలు, అటవీ భూమి సుమారు 12000 ఎకరాలు నష్టపోతారన్నారు. కాఫీ, పసుపు, ఫైనాపిల్, జామ, సీకాయ, కుంకుపూడి, చింతపండు, అడ్డాకులు, దుంపలు తదితర అటవీ ఉత్పత్తులు కోల్పోయి గిరిజనుల జీవనాధారం సర్వనాశనం అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతమంతా రిజర్వు ఫారెస్టు, పోడు వ్యవసాయం, జిరాయితీ భూమితో పాటు ఉమ్మడి, అటవీ వ్యవసాయ యాజమాన్య హక్కులు అదివాసులకు కలిగి ఉన్నాయని చెప్పారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో ప్రాజెక్టుల నిర్మాణానికి అటవీ హక్కుల కమిటీ, (టిఏసీ) తీర్మానం పొందాల్సి ఉందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రామసభ, ఎఫ్ఆర్‌సి తీర్మానం ఆమోదం లేదన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెకుల్ట ఏర్పాటుపై ప్రకటన జారీ చేయడం తగదన్నారు. గిరిజన సలహా మండలి (టిఏసి)ని సంప్రదించకుండా ప్రాజెక్టులపై రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించడం రాజ్యాంగ ధిక్కరణే అవుతుందని గుర్తు చేశారు. బాక్సైట్ తరహాలోనే హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు గిరిజనుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఎర్రవరం, పెదకోట ప్రాంతంలో పారే నీటితోనే విద్యుత్ ఉత్పత్తి కోసం 4 యూనిట్ల చొప్పున లోయర్ డ్యామ్, అప్పర్ డ్యామ్ నిర్మించడంతో రైవాడ, తాండవ ఆయకట్టు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందని ద్రాక్షగా మారుతాయని తెలిపారు. విశాఖపట్నం ప్రజలకు రైవాడ నుండే తాగునీరని, ఈ నీళ్లు హైడ్రో పవర్ ప్రాజెక్టుకు మళ్లించడంతో పారిశ్రామిక అవసరాలకు, ప్రజల తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. స్థానిక ప్రజలకు తెలియకుండా రహస్యంగా గత రెండు సంవత్సరాల నుంచి అటవీ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించడం దారుణమన్నారు. తక్షణమే రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. పృధ్వీ రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు పి. ధనుంజయ్, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ నాయకులూ రామకృష్ణ పడల్, పేదకోట నాయకులు సింహాచలం, ఈశ్వరరావు, చిట్టంపాడు నాయకులు చంద్రరావు, గిరిజనులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన హైడ్రో పవర్‌ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల గిరిజనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

- ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

డ్వాకా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాలకు చెందిన వెలుగు ఏపీఎంలు, డిపిఎంలు, ఎపిడితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అన్ని మండలాల్లోని మహిళా సంఘాలు ఇప్పటివరకు రూ.10 లక్షలు రుణాలు తీసుకున్నట్లు చెప్పారు. రుణాలను ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో గ్రేడ్లుగా విభజించి నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో స్త్రీ నిధి పథకం అమలు తీరుపై ఆరా తీశారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో రికవరీ చేయించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి రుణానికి బ్యాంకు లింక్ తప్పనిసరి చేయించాలన్నారు. ఈ సంవత్సరం చింతపండు, పసుపు ప్రాసెసింగ్‌పై ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలోని మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఎంతమంది పొంది ఉన్నారో తెలుసుకున్నారు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఒక్కొక్క మండలంలో ఎన్ని యూనిట్లు మంజూరు చేసింది మార్కెటింగ్ ఏ విధంగా జరుగుతుందో ఆరా తీశారు. వెదురుతో తయారు చేసే ప్రొడక్టులు ఈ విధంగా మార్కెటింగ్ చేస్తుందో ఆరా తీశారు. ప్రతి మండలంలోనూ మహిళా సంఘాల సభ్యులు కొనుగోలు చేసిన ఉత్పత్తులను భద్రపరిచే విధంగా ముందుగా గొడౌన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు. డిపిఎంలు పరమేశ్వరరావు, అపర్ణ, పూర్ణచంద్రరావు, యాంకర్ పర్సన్ రామరాజు, ఏపిఎంలు దుర్గాప్రసాద్, మధు, అప్పారావు, జేమ్స్ రాజు, శ్యాం కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలపై శ్రద్ధ పెట్టండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరుటౌన్: స్పందనలో గిరిజన సమస్యలు పరిష్కారానికి జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ బి.ఆర్.అంబేద్కర్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 42 అర్జీలు స్వీకరించారు. స్పందనలో స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి ప్రతీ సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ పోతునగుంట గ్రామస్తులు కిల్లో భాస్కరరావు, కొర్రా సింగరాజు, కొర్రా సన్యాసిరావు తదితర 13 మంది రైతులు రైతు భరోసా పడలేదని వినతి పత్రం సమర్పించారు. ముంచింగిపుట్టు మండలం బూసిపుట్టు పంచాయతీ బొర్రపనస గ్రామస్తులు భాస్కరరావు, శ్రీను మెయిన్ రోడ్డు నుండి బొర్రపనస గ్రామానికి రోడ్డు నిర్మించాలని అర్జీని అందజేసారు. చింతూరు మండలం తడికవాగు, రాజ్ క్యాంపు, మల్లవరం గ్రామస్తులు కె.సుందర్, కె.మంగ్ల తదితరులు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. జికె వీధి మండలం గాలికొండ పాత్రుగుంట గ్రామస్తులు పి.సత్తిబాబు, కె.బాబూరావు, గాలికొండ నుండి బత్తునూరు మీదగా పాత్రుగుంట గ్రామానికి రహదారి నిర్మించాలని, తాగునీటి సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ముంచింగిపుట్టు మండలం జర్రెల పంచాయతీ చెరువు వీధి గ్రామస్తులు సబడ బొజ్జయ్య, అప్పారావు తదితరులు కర్రీముక్కిపుట్టు నుండి ఎరుపువీధి గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టి రహదారి సదుపాయం కల్పించాలని కోరారు. చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పోతుగుమ్మాలు గ్రామానికి చెందిన వంతల సాంబరి సర్వే నెంబర్ 8/1లో ఉన్న తన భూమిని వెబ్ ల్యాండ్ వంతల చికును అని చూపిస్తోందని పేరును సవరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ లబ్బంది గ్రామానికి చెందిన పొంగి బిములు వైఎస్ఆర్ చేయూత పథకం మంజూరు చేయాలని కోరారు. ముంచింగిపుట్టు మండలం డింబుగుడ గ్రామానికి చెందిన పంజరి ప్రవళ తన కుమారుడు పంజరి మంజునాయుడు పేరు తప్పుగా నమోదు చేయడంతో అమ్మ ఒడి మంజూరు కావడం లేదని ఇంటి పేరును వైట్ సైట్‌లో సవరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ విఎస్ ప్రభాకరరావు, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ లీలాక్రిష్ణ, టిడబ్ల్యూ ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, ఆర్ అండ్ బి ఇఇ బాల సుందరబాబు, డిఆర్‌డిఎ పిడి మురళి, పిఆర్ ఇఇలు కె.లావణ్యకుమార్, కొండయ్య పడాల్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రక్తదానం చేయాలి

జిల్లా అధికారులు, సిబ్బంది అవకాశం ఉన్న మేరకు రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్పందనలో జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ఈ నెల 21న ఐటిడిఎ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సబ్బంది రక్తదానం చేయాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



కెనాల్ బయట వైపు రివిట్ మెంట్ పనులు జరుగుతున్న దృశ్యం

పటిష్టంగా పవర్ కెనాల్ మరమ్మతులు

ప్రజాశక్తి -సీలేరు

డొంకరాయి పవర్ కెనాల్‌కు భవిష్యత్తులో ముప్పు వాటిల్లకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ 3/6 రీచ్ వద్ద గత నెల 14న అర్ధ రాత్రి గండి పడిన విషయాన్ని ప్రస్తావిస్తూ దానికి సంబంధించి కెనాల్ లోపల భాగం పనులు ఇంతకుముందే పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం బయట వైపు పనులు దాదాపు పూర్తికా వస్తున్నాయన్నారు. మరో వారం పది రోజుల్లో పవర్ కెనాల్ మరమ్మతు పనులు పూర్తి స్థాయిలో చేయడం జరుగుతుందని చెప్పారు. డొంకరాయి పవర్ కెనాల్ బయట వైపు రివిట్ మెంట్ (రాయసోలింగ్) పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పవర్ కెనాల్ అంతర్భాగం, బయటి వైపు నుంచి వచ్చే ఊటనీరు పోయేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. బలిమెల, జోలాపుట్, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో మన వాటా 41 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీటితో సీలేరు కాంప్లెక్స్ పరిధిలో విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తికి, గోదావరి డెల్టా నీటి అవసరాలు బట్టి నీటిని విడుదల చేస్తూ, పొదుపుగా నీటిని వినియోగించుకోవడం జరుగుతుందని చెప్పారు. సీలేరు కాంప్లెక్స్‌లో గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని, ప్రస్తుతం పవర్ కెనాల్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

డ్రెయినేజీలు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కుమ్మరిపుట్టు గ్రామంలో డ్రెయినేజీలు లేక పోవడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను శుక్రవారం ఐటిడిఎ స్పందనలో టిడిపి నాయకులు, కుమ్మరిపుట్టు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీలు లేక పోవడంతో అస్తవ్యస్తంగా ప్రవహిస్తున్న మురుగునీటితో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాలల్లో వినియోగిస్తున్న మురుగు నీరు గ్రామానికి చేరకుండా డ్రైనేజీ సదుపాయం కల్పించాలని, నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించి వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మురుగు నీటితో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దోమలతో వ్యాధులు ప్రబలకుండా ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇదే సమస్యపై స్పందనలో 2021 అక్టోబర్ 29న ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని వివరించారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, లేకపోతే ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, గ్రామస్తులు కోడా వెంకటసురేష్, త్రినాథ్, నాగరాజు, అప్పలకొండ, ప్రసాద్, సలేబు సురేష్, కోటేశ్వరరావు, పుణ్యమూర్తి, నరసింహమూర్తి, చిన్ని, రమేష్, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రానికి వచ్చిన గిరిజనులు

ఆధార్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి -హుకుంపేట: ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక విఆర్ఓ డి కొండబాబు కోరారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఏడు రోజులు పాటు ఉచితంగానే సేవలు అందిస్తామని శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆధార్‌కు సబంధించిన సేవలను చేపట్టారు. బయోమెట్రిక్ అప్డేట్ సరి చేసుకోవాలని ఆయన సూచించారు. ఆధార్ అప్డేట్ సేవలు ఈనెల 25 వరకు ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్దకు పలువురు గిరిజనులు తరలి వచ్చారు.

గొల్లగుప్ప అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి - ఎటపాక

మండలంలోని గొల్లగుప్ప రెవెన్యూ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. గ్రామంలో రేషన్, ఉపాధి హామీ కార్డులు మంజూరు చేయాలని, అంగన్వాడీ బిల్డింగ్ నిర్మాణం చేయాలని, బండిరేవు నుండి గొల్లగుప్ప వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. శుక్రవారం గొల్లగుప్ప గ్రామంలో పద్దం లక్కీ అధ్యక్షతన జరిగిన గ్రామ జనరల్ బాడీ సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ గొల్లగుప్ప గ్రామం రెవెన్యూ రికార్డుల్లో రెవెన్యూ గ్రామంగా ఉన్నప్పటీ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. గ్రామంలో కనీసం రేషన్, ఉపాధి హామీ కార్డులు కూడా మంజూరు చేయడం లేదన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గొల్లగుప్ప గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఐవి (వెంకటేశ్వర్లు), గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇర్ప అజయ్, సొందె రామారావు, పెనుబల్లి వెంకన్నబాబు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

అర్ధరాత్రి నిలిచిన భద్రాచలం బస్సు

ఎముకులు కొరికే చలిలో ఇబ్బందిపడ్డ ప్రయాణికులు



చింతపల్లి బస్టాండ్‌లో నిలిచిపోయి ఉన్న భద్రాచలం బస్సు

ప్రజాశక్తి -సీలేరు

విశాఖ నుండి భద్రాచలం వెళ్తున్న విశాఖపట్నం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్ సర్వీస్ గురువారం రాత్రి 11 గంటల సమయంలో మరమ్మతులకు గురై చింతపల్లి బస్టాండ్‌లో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఎముకులు కొరికే చలిలో బిక్కు బిక్కు మంటూ నిరీక్షించవలసిన దుస్థితి నెలకొంది. ఈ బస్సులో ప్రయాణించిన పండా రామ్మోహన్ కథనం ప్రకారం... విశాఖ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరిన విశాఖపట్నం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ నైట్ సర్వీస్ బస్ నర్సీపట్నం చింతపల్లి మీదుగా భద్రాచలం చేరాల్సి ఉంది. డౌనూరు వచ్చేసరికి పవర్ స్టీరింగ్ బాక్స్‌లో ఆయిల్ లీక్ అవుతున్నట్లు డ్రైవర్ గమనించారు. అయినా ఆపకుండా రాత్రి 11 గంటలకు చింతపల్లి చేరుకున్నారు. అక్కడ బస్సు డ్రైవర్ పవర్ స్టీరింగ్ బాక్సులో ఆయిల్ ఉందో లేదో అని పరిశీలించగా పూర్తిస్థాయిలో ఆయిల్ అయిపోయినట్లు గుర్తించారు. బస్సు ఇక్కడి నుంచి భద్రాచలం వెళ్లే పరిస్థితి లేదని ప్రయాణికులకు బస్సు డ్రైవర్ చెప్పారు. దీంతో గురువారం రాత్రి చింతపల్లి బస్టాండ్‌లో ఎముకులు కొరికే చలిలో సుమారు 50 మంది ప్రయాణికులు గంటకు పైగా నిరీక్షించవలసిన దుస్థితి నెలకొంది. బస్ డ్రైవర్ విశాఖ ఆర్టీసీ మేనేజర్‌కు సమాచారం అందించారు. దీంతో నర్సీపట్నం డిపోకు చెందిన టూ స్టాప్ బస్సు చింతపల్లిలో నైట్ హాల్ట్ ఉండగా, దానిలో ప్రయాణికులను భద్రాచలం తరలించారు.

ఇటీవల రాత్రి సమయాల్లో కారడవిలో విశాఖ, మధురవాడ డిపోలకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసులు మరమ్మతులు గురై నిలిచిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కాలం చెల్లిన అల్ట్రా డీలక్స్ బస్సుల్ని ఆర్టీసీ అధికారులు నడుపుతూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. సుదీర్ఘ ప్రాంతాలకు అందులోనూ ఘాట్ రోడ్డులో ప్రయాణించే బస్సులు కండిషన్‌లో లేకపోవడంపైనా, ఇలాంటి సంఘటనలు పలు మార్లు చోటుచేసుకోవడంపైనా, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపైనా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు కండిషన్ కలిగిన బస్సుల్ని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

- 3 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా పోలీసులు నాటుసారా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించి మూడు వేల లీటర్ల బెల్లం పులుపును, 20 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సై రాజారావు, సిబ్బంది ఏపీఎస్పీ, మహిళా పోలీసులు మండలంలోని సురేంద్రపాలెం గ్రామ శివారులో నాటుసారా తయారీ, క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు ముందస్తు సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 3వేల లీటర్ల బెల్లం పులుపును, వంట సామాగ్రిని డ్రమ్ములను ధ్వంసం చేశారు. అనంతరం ఆయా గ్రామాల గిరిజనులతో సమావేశమై పోలీసులు నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటు సారా తయారీ క్రయవిక్రయాలు చట్ట వ్యతిరేకమని, అటువంటి చర్యలకు ఎవరు పాల్పడితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని చెప్పారు. ఇకపై నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



బెల్లం పులుపు, నాటు సారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రెజ్లింగ్ విజేతలకు అభినందన



రెజ్లింగ్ విజేతలను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్‌సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ ఆధ్వర్యంలో కొయ్యూరు జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న రెజ్లింగ్ అకాడమీకి చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు 8 బంగారు, 4 రజత, 2 కాంస్య పతకాలు సాధించారు. ఈనెల 12 నుంచి 14 వరకు అనంతపురం జిల్లా దిమ్మగుడి జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాప్ లీగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పతకాలు సాధించిన విద్యార్థులు జిల్లా కలక్టర్ కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఐటిడిఎ సమావేశమందిరంలో శుక్రవారం కలిసారు. కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు మేమెంటోలు, పతకాలను అందజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. బాలికల్లో రాణి, రూతు, కేస్య, దేవమ్మ, రూప, దేవి, సుజాత, కమల, బాలురులో కార్తీక్, రమణబాబు, మహేష్, ప్రసాద్, సిహెచ్ మహేష్ పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. వీరికి కోచ్‌లుగా పిడిలు ఎ.నూకరాజు, వి.బాలన్న, పి.సింహాచలం వ్యవహరించారు.

జగనన్న గృహ నిర్మాణ వ్యయం పెంచాలి

సిపిఐ ఆధ్వర్యాన సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జగనన్న కాలనీ ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.1.80లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని , టిడ్కో ఇళ్లను అర్హులకు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతంలోని జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులను కలిసి సంతకాలు సేకరణ చేపట్టారు.

ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైసిపి అధికారం చేపట్టే నాటికి రాష్ట్రంలో 3,13,832 టిడ్కో ఇళ్లు నిర్మాణంలో ఉండగా, వాటిలో 8,1040 పూర్తయ్యాయన్నారు. పూర్తయిన ఈ ఇళ్లను కేటాయింపులో వైసిప తాత్సారం చేస్తోందన్నారు. ఇంటిస్థలాల లబ్ధిదారులకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కేటాయించాలని కోరారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, వచ్చేనెల 6న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించి, అనంతరం వినతిపత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె రెహమాన్, సిఎన్ క్షేత్రపాల్, నాయకులు ఎస్.మురళి, ఎ.దేముడమ్మ, కె లక్ష్మణరావు, సిహెచ్ కాసుబాబు, సందీప్, మస్తాన్‌బీ, కె.రమణ, వి.నూకరాజు, సురేష్, సిడిఆర్ రమణ పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

జిల్లా రవాణాశాఖాధికారి లీలాప్రసాద్



మాట్లాడుతున్న లీలాప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు: రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన జిల్లా రవాణా అధికారి(డి.టి.ఓ) లీలా ప్రసాద్ మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ప్రమాదాలు సంభవించినప్పుడు మొదటి ఒక గంట చాలా కీలకమని, ఆ సమయంలో అందించే సహాయంతో మరణాలను నివారించ వచ్చని పేరొకన్నారు. ఈ గోల్డెన్ అవర్ లో సహాయం తప్పనిసరిగా అందించాలని సూచించారు. ప్రమాదంలో సాయం అందించిన వ్యక్తిపై ఎటువంటి వేధింపులు, విచారణలు చేయటం జరగదని, పోలీసుల, కోర్టుల చుట్టూ తిరగాలనే భయం లేదని, చేతనైన సహాయం అందించాలని సూచించారు. ప్రమాదం బారిన పడిన వ్యక్తిని రక్షిస్తే ఆ వివరాలు అందిస్తే ప్రభుత్వం ఐదు వేల రూపాయలు నగదు పారితోషికం కూడా అందిస్తుందన్నారు. ఒకవేల ఒకరికంటే ఎక్కువ మంది ప్రమాద సమయంలో రక్షణలో పాల్గొంటే ఆ మొత్తాన్ని సమ భాగాలుగా పంపిణీ చేస్తారని వివరించారు. ద్విచక్ర వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కే.వాసు మాటాడుతూ, అర్హత ఉన్న విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, మత్తు పదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయరాదని వివరించారు. ఓవర్ రైడింగ్, స్పీడ్ రైడింగ్, చేయరాదని, అంబులెన్స్, పోలీస్, ఫైర్ వాహనాలకు దారి ఇవ్వాలని కోరారు. వైద్యులు శ్రీకాంత్ మాట్లాడుతూ, గోల్డెన్ అవర్ లో చేయాల్సిన ప్రక్రియను ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదం జరిగినప్పుడు నాడి పరీక్షకు మెడ కింద రెండు వేళ్ళు పెట్టి చూడాలని, నాడి స్పందించకపోతే ప్రథమ చికిత్సగా సిపిఆర్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. చిట్టిబాబు, లెక్చరర్ విజయ్, పిఇటి ప్రసాద్ నాయుడు, డిపిఆర్‌ఓ పి.గోవింద రాజులు, డిగ్రీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంటర్‌ప్యూనర్‌షిప్‌ను ప్రోత్సహించాలి

డ్రీమ్‌వాల్‌ను సందర్శించిన బివిఆర్ మోహన్ రెడ్డి

ఎయు సాధిస్తున్న ప్రగతిని ప్రత్యక్ష పరిశీలన



డ్రీమ్ వాల్ సందర్శనలో బివిఆర్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సైయంట్ టెక్నాలజీస్ వ్యవస్థాపక చైర్మన్ బివిఆర్ మోహనరెడ్డి సందర్శించారు. ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు స్ఫూర్తిని నింపే విధంగా ఏర్పాటు చేసిన డ్రీమ్‌వాల్‌ను పరిశీలించారు. విభిన్న రంగాల్లో అత్యున్నత ప్రగతిని సాధించిన వారి చిత్రాలతో దీనిని ఏర్పాటు చేయడం ద్వారా యువతలో స్ఫూర్తిని నింపి, భవిష్యత్తులో తాము అటువంటి స్థానాలకు చేరుకోవాలనే తృష్ణను కలిగిస్తుందన్నారు. అనంతరం ఎయులోని ఇంక్యుబేషన్ సెంటర్, నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫుడ్, ఫారా ఇంక్యుబేషన్, ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ తదితర కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డితో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎయులో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న విధానంపై ఆనందాన్ని, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బివిఆర్ మోహనరెడ్డి మాట్లాడుతూ ఎంటర్‌ప్యూనర్‌షిప్‌ను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. డిగ్రీల కంటే నైపుణ్యాలు ప్రధానమైనే నేపథ్యంలో దీనికి అవసరమైన వ్యవస్థను నిర్మించాలన్నారు. అధ్యాపకుల్లో నైపుణ్యాల పెంపునకు నిరంతర కృషి జరగాలన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కోర్సులను, సబ్జెక్టులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎయు విసి ప్రసాదరెడ్డి స్టార్టప్స్ ప్రగతి, చెయిర్ ప్రొఫెసర్స్, సిఎస్ఆర్ నిధులు సేకరణ తదితర అంశాలను వివరించారు. ఎయులో చెయిర్ ఏర్పాటు చేయాలని విసి కోరగా, దానికి మోహనరెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అంబేద్కర్ చెయిర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ రవి ఈశ్వరపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయు తరపున మోహనరెడ్డిని సత్కరించారు.

31లోగా అపరాధ రుసుముతో 'పది' పరీక్ష ఫీజు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులకు తత్కాల్ ఫీజు చెల్లించేందుకు జనవరి 23 నుంచి 26 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. రూ 500 రుసుముతో జనవరి 23 నుంచి 26 వరకు, రూ.వెయ్యి అపరాధ రుసుముతో జనవరి 27 నుంచి 31 వరకు టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించవచ్చున్నారు. తత్కాల్ పరీక్ష రుసుము చెల్లింపు గడువు ఎట్టి పరిస్థితిలోనూ పొడిగించబడదని, విద్యార్థులు గమనించి, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



అగ్నికి ఆహుతైన గృహోపకరణాలు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగి గృహం దగ్ధమైంది. ఈ దుర్ఘటన శుక్రవారం మండలంలోని సుజనకోట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండి బాపన్న ఇంటిలో షార్ట్ సర్క్యూట్‌తో మంటల చెల రేగడంతో గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇళ్లంతా వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు నీళ్లు చల్లి మంటల్ని అదుపు చేసారు. గృహంలో సామగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. సుమారుగా రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక విఆర్వో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఔషధ ప్రయోగాలకు ప్రత్యామ్నాయాలపై దృష్టి



మాట్లాడుతున్న గీతం ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ రామారావు

ప్రజాశక్తి- మధురవాడ : వివిధ వ్యాధుల నియంత్రణకు కనిపెట్టే ఔషధాలు, వ్యాక్సిన్లకు ప్రస్తుతం జంతువులపై జరుపుతున్న ప్రయోగాల స్థానే ప్రత్యామ్నాయమార్గాలపై పరిశోధకులు దృష్టి సారించారని, త్వరలోనే అవి ఎ అందుబాటులోకి రానున్నాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాల డీన్ ప్రొఫెసర్ పి.రామారావు వెల్లడించారు. గీతం వేదికగా భారత ప్రభుత్వ యానిమల్ వెల్ఫేర్ విభాగం నిర్వహిస్తున్న ప్రాంతీయ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ,. నూతన ఔషధ ఫలితాలను తెలుసుకునేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా 20 మిలియన్ల జంతువులపై ప్రయోగాలు జరుపుతున్నారన్నారు. దీనిపై జంతు సంక్షేమ సంఘాలతో పాటు శాస్త్రవేత్తలల్లోనూ ఆందోళన వ్యక్తమౌతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టారన్నారు. ఔషధాలకు తుది అనుమతులు మంజూరు చేసే అమెరికాలోని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) జంతువులపై ఔషధ ప్రయోగాలు వద్దని నిర్ణయించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల ఆవశ్యకత పెరిగిందన్నారు. ఔషధ పరీక్షలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ విధానాలలో ప్రత్యామ్నాయం ఇటీవల గుర్తించారన్నారు. జీబ్రాఫిష్ నమూనా ఆధారంగా ఔషధ పరీక్షలకు అవకాశం ఏర్పడిందన్నారు.

కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మల్ల రామారావు, పి.గణపతి, కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్ విజన్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్ ఆన్ యానిమల్స్ జాతీయ సలహదారులు డాక్టర్ కృపాలి పాండే, డాక్టర్ రీచా రౌతేల, డాక్టర్ సమీక్షా సక్లాని, ఎయు ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కంచరపాలెం.: కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐ (ఓల్డ్)లో ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రారంభం కానున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 45రోజులపాటు శిక్షణ పొందుటకు 21ఏళ్ల వయస్సు కలిగి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులన్నారు. అలాగే ఈనెల 30లోగా హెవీ వెహికల్ ఎల్ఎల్ఆర్ కలిగి, ఏడాది అనుభవం ఉండాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 9177967397 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

పెట్టుబడులకు విశాఖ అనుకూలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెట్టుబడులకు విశాఖ నగరం ఎంతో అనుకూలమని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. వైజాగ పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (విసిసిఐ) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని దసపల్లా హోటల్‌లో 'భవిష్యత్తులో వైజాగ్ వృద్ధి - అవకాశాలు' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో విశాఖ జిల్లా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎప్పటికప్పుడు నూతన ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. అనందపురం మండలంలో 155 ఎకరాల్లో రానున్న 5, 6 నెలలో నూతన ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేయనున్నామని వెల్లడించారు. రెండు పోర్టులు కలిగిన ఈ నగరం ఎగుమతులకు ఎంతో అనుకూలమన్నారు. మార్చి 4, 5 తేదీలలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించనున్నామని, అందులో విసిసిఐ భాగస్వామిగా ఉందని అన్నారు. మార్చి 28, 29, 30 తేదీల్లో దేశంలోనే అతి పెద్ద జి-20 సమ్మిట్ జరుగనుందని, అందులో కూడా విసిసిఐ భాగస్వామిగా ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖ పరిపాలనా రాజధాని కానుందని, దానికి సంబంధించిన కార్యకలాపాలను ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దేశంలో ముంబయి తర్వాత ఆర్థిక రాజధానిగా ఎదిగే అవకాశం విశాఖకే ఉందని ఆయన అన్నారు. వచ్చే నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరగనుందని, నేషనల్ హైవే -16ను ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేయనున్నామని, తద్వారా నగరంలో రవాణా వ్యవస్థ సులభతరం అవుతుందని తెలిపారు. సుమారు 15 వేల కోట్ల వ్యయంతో నూతన డేటా సెంటర్‌కు రానున్న 5, 6 నెలల్లో శంకుస్థాపన జరగనుందని, తద్వారా సుమారు 7 వేలు ఉద్యోగాలకు అవకాశం ఉందని తెలిపారు. అనకాపల్లి - అనందపురం హైవే రోడ్డును 5, 6 నెలల్లో ప్రారంభిస్తామని, రూ.131 కోట్లతో జిల్లా వ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేయనున్నామని, నగరంలో 12 పై ఓవర్ల నిర్మాణానికి ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో విసిసిఐ ప్రస్తుత అధ్యక్షుడు ఆర్.సతీష్, సభ్యులు పిఎల్ఎన్.రాజు, కార్యదర్శి రోలండ్ విలియమ్స్, మాజీ అధ్యక్షులు బివి.రాజు, నూతన సభ్యులు రాజశేఖర్ గిడుతురి, బివిఎస్.ప్రభాకర్, కోశాధికారి సురేంద్ర స్వామి పాల్గొన్నారు.

నాలుగైదు నెలల్లో పరిపాలనా రాజధానిగా విశాఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రానున్న 4, 5 నెలల్లో విశాఖపట్నం పరిపాలనా రాజధాని కానుందని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ విశాఖ రాజధాని గురించి పలు అంశాలను ప్రస్తావించారు. పరిపాలనా రాజధాని దిశగా ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రాజధానిగా విశాఖ ఆవిర్భవిస్తే నగరానికి మరిన్ని నూతన పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయన్నారు. మెట్రో రైలు కూడా త్వరలోనే విశాఖకు రానుందని, తాజాగా దీనిపై చర్చలు జరిగాయని, నెల రోజుల్లో మెట్రో పనులపై ప్రకటన రాబోతోందని అన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ పని చేస్తున్నాయని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న ఎపి ఎన్‌జిఒ భవన్‌లో 2023కు సంబంధించి ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్‌తో కలసి శ్రీనుబాబు మీడియాతో మాట్లాడారు. 15 రోజుల పాటు విశాఖ జిల్లా సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసరావు, ఇరోతి ఈశ్వరరావు, కామాకుల మురళీకృష్ణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజాభీష్టానికి అనుగుణంగా నిర్ణయాలు చేయాలి

- ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం వెల్లడి



పబ్లిక్ హియరింగ్‌లో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు (స్క్రీన్‌పై)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ప్రజల అభీష్టానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఎపిఇఆర్‌సి ఆధ్వర్యంలో రెండు రోజులుగా గురుద్వార్ సమీపంలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో శుక్రవారం ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు వర్చువల్ ద్వారా పాల్గొన్నారు. ముఖ్యమైన సూచనలు, ప్రతిపాదనలు, అభిప్రాయాలను కమిషన్ ముందు ఉంచారు. అత్యంత ప్రాధాన్యతగల ప్రజాభిప్రాయ సేకరణను కేవలం వర్చువల్‌గా నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అత్యధిక మంది ఇటువంటి కార్యక్రమంలో భాగస్వాములయ్యే విధంగా ప్రత్యక్షంగానూ, వర్చువల్‌గానూ జరపాలని కోరారు. డిస్కంలు తమకు, వెబ్‌సైట్‌లో పెట్టిన నివేదికలపై తాము సమర్పించిన లిఖితపూర్వక అభ్యంతరాలకు ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా లేవన్నారు.

'రాష్ట్రంలో విద్యుత్ రంగం ప్రమాదంలో ఉంది. విద్యుత్ ఒప్పందాలు ఆందోళనకరంగా ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ నుంచి ప్రభుత్వం వైదొలగి ప్రయివేటు చేతుల్లోకి పోతోంది. ప్రభుత్వ గుత్తాధిపత్యం బదులు ప్రయివేటు గుత్తాధిపత్యం పెరగడం రాష్ట్రానికి నష్టం' అని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ వల్ల ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థలకు, ప్రజలకు, రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతమన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల్లో ప్రయివేటు సంస్థలను అనుమతించరాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చట్ట సవరణలను తిరస్కరించాలని సూచించారు. ఎపిఇఆర్‌సి తన పరిధిలోని ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ మూడు డిస్కంలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి కావల్సిన ఆదాయం రూ.52590.71 కోట్లుగాను, టారిఫ్ పెంపు రూ.697 కోట్లుగాను, రెవెన్యూ అంతరం రూ.12792.70 కోట్లుగాను ప్రతిపాదించిన విషయాన్ని తెలిపారు. ఈ రెవిన్యూ అంతరాన్ని ఏ విధంగా పూడుస్తారన్నది డిస్కాంలు స్పష్టం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఈ లోటును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ప్రజలపై ఎటువంటి భారాలూ వెయ్యరాదని ఇఆర్‌సికి సూచించారు.

అన్నదాత నేడు తీవ్ర సంక్షోభంలో ఉన్నాడని, ఇటువంటి తరుణంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపునకు ప్రతిపాదించడం మరింత సంక్షోభంలోకి నెట్టడమే అవుతుందని అన్నారు. మీటర్ల బిగుంపును తక్షణమే విరమించుకోవాలని కోరారు. నివాస గృహాలకు, వ్యాపార సంస్థలకు, వినియోగదారులందరికీ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతిపాదన చేశారని, ఇది ప్రజల మీద మరింత భారాలు వేసేదిగా ఉందని పేర్కొన్నారు. ఈ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. కరోనా విపత్తు, విద్యుత్ కోతల సమయంలో చిన్న తరహా పరిశ్రమలకు ఎమ్‌డి ఛార్జీలు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇంత వరకూ అమలు చేయలేదని తెలిపారు. కరోనా విపత్తు వల్ల అత్యధికం సంక్షోభంలో పడ్డాయని, కొన్ని మూతబడ్డాయని తెలిపారు. వీటికి విద్యుత్ రాయితీలు తిరిగి ఇవ్వాలన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వీటిని సంక్షోభం నుంచి బయటపడేయాలని కోరారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టి తరగతుల ప్రజలకు ఉచిత విద్యుత్తును ఇప్పటికే కొన్ని చోట్ల నిలిపివేశారని, తక్షణమే పునరుద్ధరించాలని విన్నవించారు. నివాసంతో నిమిత్తం లేకుండా ప్రతి ఎస్‌సి, ఎస్‌టి కుటుంబానికి ఉచిత విద్యుత్ రాయితీ వర్తింపజేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాలను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల నుంచి అదనపు లోడు, కన్స్యూమర్ డిపాజిట్స్, పెనాల్టీలు, ట్రూ అప్ ఛార్జీలు విచక్షణా రహితంగా వసూలు చేస్తున్నారని, ఇవి ప్రజలకు మోయలేని భారంగా ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌ను లాభనష్టాలతో చూడరాదన్నారు.

విద్యుత్ ప్రమాదాలు, మరణాలు విశాఖలో పెరిగాయని, నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదాలకు బలవుతున్నారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయిల నష్టపరిహారం, మృతుని కుటుంబ సభ్యునికి పర్మినెంట్ ఉపాధి కల్పిస్తూ ప్రభుత్వం జిఒ జారీ చేయాలని కోరారు. వినియోగదారుని ఆధార్ కార్డు ఆధారంగా నూతన విద్యుత్ కనక్షన్ మంజూరు చేసే పద్ధతిని నిలుపుదల చేశారని, ఇంటి పట్టాలు, ఆస్తి పన్నులు, ఇతర డాక్యుమెంట్లు లేవనే పేరుతో నూతన కనక్షన్లు మంజూరు చేయడం లేదని తెలిపారు. దీనివల్ల జిల్లాలో వందలాది మంది విద్యుత్ సౌకర్యానికి నోచుకోవడం లేదన్నారు. .కనుక పాత పద్ధతినే పునరుద్ధరించాలని ప్రతిపాదన చేశారు.

జివిఎంసిని సందర్శించిన డోన్ కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డోన్ మున్సిపాలిటీ ఛైర్మన్ ఎస్.రాజేష్ నేతృత్వంలోని 34 మంది కౌన్సిలర్లు జివిఎంసిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్, ఉన్నతాధికారులు వారికి స్వాగతం పలికారు. జివిఎంసిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్.వర్మ, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం కౌన్సిలర్లకు జివిఎంసి తరపున నగర మేయర్ జ్ఞాపికలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా డోన్ మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ జివిఎంసి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిచ్చాయని తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : నగరంలో ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నగరంలోని డాబాగార్డెన్స్, రుషికొండ, పిఎం పాలెం తదితర ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్‌పి జి.స్వరూపరాణి నేతృత్వంలో ఈ దాడులు సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై కేసును నమోదు చేసినట్లు స్వరూపరాణి మీడియాకు తెలిపారు. ఆయా వాటర్ ప్లాంట్లలో మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టుల ఆధారంగా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లక్ష్మోజి ఉన్నారు.



ఆందోళనకు దిగిన అభ్యర్థులు

ఇలాగేనా పోస్టుల భర్తీ..!

ప్రజాశక్తి - సీతమ్మధార : వైద్య ఆరోగ్యశాఖ జోన్ 1 పరిధిలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ నర్స్ పోస్టుల కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఎస్‌సి అభ్యర్థులకు న్యాయం జరగలేదని పలువురు వాపోయారు. మార్కులు వేయడంలోనూ, జాబితాను పొందుపరచడంలోనూ తప్పిదాలు చోటుచేసుకున్నాయన్నారు. శుక్రవారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగడంతో ద్వారకా పోలీసులు కౌన్సెలింగ్ సెంటర్ వద్ద మోహరించారు. అందోళనకారులను పోలీసులు కౌన్సిలింగ్ కేంద్రం లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సెలక్షన్ జాబితాలో ఉన్నవారిని మాత్రమే అనుమతించారు.

విదేశీ వర్సిటీల ప్రవేశంపై నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో విదేశీ యూనివర్సిటీల ప్రవేశానికి అనుమతిస్తున్న యుజిసి ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కృష్ణా ప్రభుత్వ కళాశాల వద్ద పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఎల్. భాను మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలు, విదేశీ ఉన్నత విద్యా సంస్థల ప్రవేశానికి అనుమతిస్తున్నట్లు అధికారులు ప్రకటించడం దారుణమన్నారు. విదేశీ విద్యాసంస్థలు వ్యాపార ప్రయోజనాలను ఆశిస్తాయిగానీ దేశ విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే ఉద్దేశ్యంతో రావని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.విశ్వనాథ్, వి.లక్ష్మి, చరిష్మా, మోహన్, చరణ్ పాల్గొన్నారు.